# అంతరం

–కందర్ప గీతా మూర్తి, **Hyderabad, AP**

"అబ్బబ్బా! ఏం పిల్లలు వీళ్ళు! భయము లేదు, భక్తి లేదు" అని విసుక్కుంది విశాలాక్షమ్మ. ఆవిడ అలా విసుక్కోవడము బహుశా నూరవ సారేమో!ప్రొద్దునించి అలా విసుక్కుంటూనే వుంది. ఆమె మాట వినేవారెవరు? పట్టించుకునేవారెవరు? "బామ్మకు చాదస్తం లే " అని తీసి పారేస్తారు ఆమె మనవలు. మేడ మీద నుంచి పాశ్చాత్య సంగీతం పెద్దగా పెట్టుకుని పిల్లలంతా పిచ్చి గెంతులు వేస్తున్నారు. ఉదయం 9 గం||లకు మొదలయింది ఈ సొద అని మరొక్కసారి వల్లించుకుంది ఆవిడ. మధ్యలో అంతా క్రిందకు వచ్చి దొరికిన పండ్లు, తినుబండారాలు తిని మళ్ళీ పైకి వెళ్ళేరు. "బొత్తిగా పెద్దతరం, చిన్న తరం లేదు హాయ్! బామ్మగారూ అని ఎగతాళి కూడానూ. ఏం చక్కా లక్షణంగా నమస్కారం బామ్మగారూ అని అనవచ్చు కదా! మర్యాద మప్పితము లేదు. ఇలా పెంచిన తల్లితండ్రులను అనాలి" ఆఫీసు పని మీద టూరు వెళ్ళిన కొడుకును, పిక్నిక్కు వెళ్ళిన కోడలును తిట్టుకుంది విశాలక్ష్మమ్మ. అయ్య తిరుపతి, అమ్మ పరపతి అన్నట్లు చెరో వేపు వెళ్ళేరు. ఈ పిల్లలంతా యిక్కడ చేరేరు. మా కోతి మూకకు తోడు వీళ్ళంతా కూడను అని గొణుక్కుంది బామ్మగారు. ఆవిడ అలా విసుక్కునే కోతి మూక ఆమె మనవరాళ్ళు రేఖ, సురేఖలు. వాళ్ళ ముద్దు పేర్లు 'రె', 'సురే'. బాగుంది సంబడం సుబ్బరంగా రేఖారాణి అని వుంటే 'రే' గాను, సురేఖ దేవిని 'సురే' అని పిలుస్తారు. ఒరే! సురే అని ఆ పిలుపులేమిటో వాళ్ళమ్మ ను సునీత అని లక్షణంగా పేరుంటే అంతా 'సున్ని' అని పిలుస్తారు. సున్నీట సున్ని! సున్నుపిండి లాగ పూర్తి పేరు పెట్టి పిలవడం నామర్దా గాబోలు. మా చిన్నతనంలో ఎంచక్కా పూర్తి పేరు పెట్టి పిలిచేవారు. 'విశాలాక్షి' అని మా నాన్నగారు ఎంత గంభీరంగా పిలిచేవారు! నాన్నగారంటే గుర్తుకొచ్చింది, ఈ రోజులలో అమ్మ, నాన్న పిలుపులెక్కడ? అంతా మమ్మి, డాడిలే కదా!. ఆమధ్య సురేఖ స్నేహితురాలు లలితను "అమ్మా! మీ నాన్నగారు బాగున్నారా?" అంటే మూతి మూడు వంకలు తిప్పి "మా డాడి హెల్తీగా వున్నారండి" అంది. బాగున్నారా అని అడిగితే ఏదో హాస్పటలులో ఉన్నారా అన్నట్లు బాధ పడింది ఆ అమ్మాయి. ఏమిటో మన సంస్కృతి, భాష మరచి పోతున్నారు. పిల్లలంతా ఇంట్లో ఇంగ్లీషు తప్ప ఇంకొక భాష మాట్లాడరు. ఏదో పెద్ద దొరల్లాగ. "అమ్మా!.పిల్లలకు తెలుగు నేర్పవే అనడు నా కొడుకు. బామ్మకు ఇంగ్లీషు నేర్పకోడదూ?" అని హాస్యాలాడతాడు. ఇది ఇంట్లో వరస. ఒకప్పుడు బారెడు జడలతో ఆడపిల్లలు లక్ష్మి కళతో ఉట్టి పడేవారు. మరి ఇప్పుడు ఆడో, మగో తెలియడం లేదు. అందరు క్రాపులు, పాంట్లు, చొక్కాలే! ఈ మధ్య రేఖ స్నేహితులను తీసుకు వస్తే "మొగ పిల్లలతో స్నేహమేమిటే! అలా బుజాలు బుజాలు కలుపుకుని తిరగడమేమిటి? అవ్వ!" అంటే "వాళ్ళు మగపిల్లలు కారు బామ్మ, అంతా గర్ల్స్" అని ఎంత పగలబడి నవ్విందో. నా చిన్నతనంలో బారెడు జడకు జడకుప్పెలు వేసుకుని తల్లో నాగరం, చెవులకు జుంకాలు, కాళ్ళకు మువ్వ పట్టెలు పెట్టుకుని, పట్టు పావడా తొడుక్కుని చెంగు చెంగున గెంతితే అంతా విశాలాక్షి బంగారు బొమ్మ! అందాల భరిణ అని పొగిడేవారు. ప్రక్కింటి అత్తయ్యగారు రోజు రెండు మూరెడు పువ్వుల దండలు కట్టి తల్లో పెట్టేవారు. "నాకే కొడుకు ఉంటే నిన్ను ఎంచక్కా కోడలు చేసుకునే దాన్ని" అనేది ఆవిడ. ఆవిడకు పాపం పిల్లలు లేరు. పిల్లలంటే ఆవిడకు చాల ఇష్టం. అమ్మ వెనకే గుడికి వెళ్ళి, వేణుగోపాలస్వామికి నమస్కరిస్తే విశాలాక్షికి చక్కని మొగుడు రావాలని దీవించేవాడు పూజారి. ఏమిటో ఆ దీవెన వింటూనే సిగ్గు ముంచుకొచ్చేది. అట్ల తద్దికి పొద్దున్నే లేచి, ఉట్టి కింద ముద్దని గోంగూర పచ్చడి, పులుసు అన్ని వేసుకుని అన్నం తిని పిల్లలందరు రోజంతా ఆడి, ఊయెలలూగి ఇంటికి వస్తే అమ్మ చక్కగా అట్లు చేసి పెట్టేది. ఎంత సంతోషంగా గడిపేమో ఆరోజులు. సంక్రాంతి వస్తే సరే సరి ప్రొద్దున్నే ఆవు పేడతో కళ్ళాపు వేసి, ముగ్గులు పోటీగా పెట్టేవాళ్ళం. పెళ్ళయ్యాక కూడ ముగ్గుల సరదా అలాగే వుండేది. వీధిలో ముగ్గులు వేస్తే, "ప్రక్క వీధికి, ఎదుటి వీధికి వెళ్ళిపోకు, వెతుక్కోలేను సుమా!" అని హాస్యం ఆడేవారు ఆయన. గత స్మృతులను గుర్తు చేసుకుని కళ్ళు తుడుచుకుంది ఆవిడ. ఇద్దరు మొగ పిల్లలను ఎంతో అపురూపంగా పెంచేము. పెద్దవాడికి సుబ్రహ్మణ్యేశ్వరుడు పేరు పెడితే అది 'మణ్యం' గాను, చిన్నవాడికి వేంకటేశ్వరుని పేరు పెడితే అది 'రావు' గా మారి పోయాయి. అలా అనుకునే సరికి అమెరికాలో డాక్టరుగా వున్న చిన్న కొడుకు మీదకు ఆలోచన మరలింది. వాడు ఎంతో కష్టపడి చదివి డాక్టరు అయ్యాడు. ఇక్కడ కంటే అమెరికాలో అవకాశాలెక్కువ అని పట్టుదల పట్టి, వాదించి మరీ వెళ్ళాడు. శుభ్రమైన సంబంధం చూసి పెళ్ళి చేసి మరీ పంపేను. సుశీల 'సు' క్రిందో 'శీల' క్రిందో మారిపోయి వుంటుంది అనుకుంది చిన్నకోడలు గురించి. చంటిపిల్లను తీసుకుని 7సం|| క్రితం ఇండియా వచ్చేడు. పిల్లకు 'జూలీ'యో లేక 'రీటా' అని పేరి పెట్టారా అంటే నవ్వుతూ 'భారతి' అని పేరు పెట్టామని చెప్పాడు. ఎప్పుడు హాస్పటలు పని, రావడానికి అవదని అంటాడు. చూసి ఎన్నాళ్ళయిందో అంటూ అలమారలో వున్న ఫొటోలు తీసి దీక్షగా చూడసాగింది ఆమె. ప్రతి రోజు ఆ ఫొటోలను ఎన్నిసార్లు చూస్తుందో ఆమెకే తెలియదు. ముచ్చటగా పట్టు పరికిణి, పెద్ద జడ ముందుకు వేసుకుని నుంచున్న మనవరాలి ఫొటో చూస్తే చిన్నప్పటి తన రూపే గుర్తుకు వస్తుంది. "బామ్మా! బహుశా అది విగ్గు ఏమో" అని నవ్వుతారు రేఖ, సురేఖలు. "నిజంగా అది సవరమో లేక విగ్గో కాదు కదా!" అని తనలో తనే తర్కించుకుందావిడ. ఇదిగో వస్తున్నాను, అదిగో వస్తున్నాను అంటాడు. ఎప్పుడు వస్తాడో? వచ్చే శనివారం తమ్ముడు, కుటుంబముతో వస్తున్నాడమ్మా అని చెప్పాడు పెద్దవాడు. సరిలేరా! వాడు వచ్చినప్పుడు చూద్దాంలే అందేగాని, గంటలు, రోజులు లెక్క పెట్టుకుంటోంది ఆవిడ. "అమ్మా! సునీత, వాడికి చేగోడిలు, జంతికలు, లడ్లు యిష్టం అవి చేయించు" అని కోడలుకు చెప్పి వంటవాడికి పురమాయించింది. చేసినవన్ని డబ్బాలలో దాచింది. "పప్పు నానవేసి రేపు ఇడ్లి చేయవోయి గోపాలం" అని హెచ్చరిక చేసింది వంటవాడికి. "దానిలోకి కొబ్బరి పచ్చడి నూరి ఫ్రిజ్‌లో పెట్టు. ఎప్పటిలాగ 8గం||రాక, కాస్త పెందలకడే రా" అనిహుకుం జారీ చేసింది. "అలాగే! పెద్దమ్మగారూ" అన్నాడు గోపాలం. అబ్బా! కొడుకు వస్తున్నాడంటే ఎంత హడావిడో! అనికున్నాడు గోపాలం మనస్సులో. "ఒసే సుబ్బులూ! అబ్బాయి, కుటుంబం వచ్చేసరికి హారతి పళ్ళెం తో సిద్ధంగా ఉండు. హారతి యిచ్చి లోపలికి తీసుకురా! వింటున్నావా" అని గదమాయించింది పనిమనిషిని. "మా కోడలు సునీతకు ఇవన్ని పట్టవు . పళ్ళెం, కర్పూరం, అగ్గిపెట్టె తెచ్చి బల్లమీద పెట్టు. ఆ సమయంలో అటు ఇటు పరిగెత్తకు" అని మరోసారి హెచ్చరించింది. గాలిలో ఎగురుతున్న విమానం శబ్దానికి తలెత్తి చూస్తున్న బామ్మని "అదిగో బామ్మా! బాబాయ్ చేతులూపు తున్నాడు చూడు" అని హాస్యాలాడేరు మనవరాళ్ళు. "దొంగ భడవల్లారా! మీకు అంతా నవ్వులాటగా వుంది" అని గదమాయించింది ఆవిడ. గేటు దగ్గర హారను విని అందరిని పురమాయించి తాను దూరంగా నుంచుంది. "మీరు ముదుకి రండమ్మా!" అన్న పనిమనిషి సుబ్బులు మాటలకు "సరేలే! ముందర ముత్తయిదువులు కనబడండి, తరువాత నేను వుంటానులే" అంది. కారు ఆగగానే హారతి తీసుకుని ఇంట్లోకి అడుగు పెడుతున్న చిన్నకొడుకును తనివి తీరా చూసుకుంది. పచ్చగా బంగారంలా ఉన్నాడు కొద్దిగా ఒళ్ళు చేశాడు, కాస్త జుట్టు పలచ బడింది, పడదా మరి. బాధ్యతలను నెత్తిమీద వేసుకుని పెద్ద హాస్పటలు నడుపుతున్నాడు. వెనకనే ఉన్న కోడలును చూసి ఆశ్చర్య పడింది. నుదుట బొట్టు, చక్కని కాశ్మీరు సిల్కు చీర కట్టుకుని, చేతినిండా గాజులు, పెద్దజడతో అచ్చు తెలుగింటి ఆడబడుచు లాగా ఉంది. అయితే ఇంకా మన పద్ధతిలోనే వుందని మురిసి పోయింది విశాలాక్షమ్మ. దగ్గర వచ్చి నమస్కరిస్తున్న కొడుకు కోడలును మనఃస్ఫూర్తిగా దీవించింది. "భారతీ! ఇలారా! బామ్మగారి కాళ్ళకు నమస్కరించు" అన్న కొడుకు మాటలు విని ఆత్రుతగా పక్కకు చూసింది. అచ్చం తన మరో రూపులా పట్టు పరికిణి, జాకెట్టు, పెద్ద జడ, జడగంటలతో, నుదుట దోస గింజలాంటి తిలకం బొట్టుతో ఉన్న మనవరాలిని ఆత్రుతగా చూసి ఎత్తుకుని

అంతరం .. (మిగతా 37వ పేజీలో)

అంతరం .. (35 వ పేజీ తరువాయి)

గుండెలకు హత్తుకుంది. 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా... పొగడరా నీ తల్లి భూమి భారతిని' అన్న పాట గుర్తుకు వచ్చింది ఆవిడకు "చూసేవా! అమ్మా! నీ మనవరాలిని. తెలుగు పద్యాలు, పాటలు అన్నీ వచ్చు. తెలుగు చక్కగా వ్రాస్తుంది, చదువుతుంది. సుశీలకు మన సంస్కృతి అంటే చాల ఇష్టం. భారతికి అన్ని నేర్పింది" అన్న కొడుకు మాటలకు ఆమె శరీరం పులకరించింది. మనవరాలి ఒత్తైన జడను తడిమి చూసింది. "సవరం కాదులే! బామ్మా! అసలయిన జడే!" అన్న రే మాటలకు అంతా నవ్వుకున్నారు. ఈ దేశంలో పుట్టి పెరిగినవారు విదేశ నాగరికత మోజులో పరుగెడుతూ వుంటే విదేశాలలో పుట్టి పెరిగిన వారు మన సంస్కృతి, ఆచారాలను, భాషను నిలబెట్టు కుంటున్నారంటే చాలా ఆశ్చర్యంగా, ఆనందంగా ఉంది అని గర్వ పడింది. విశాలక్షమ్మ. పాశ్చాత్య పోకడలను అనుసరిస్తున్న పెద్దకోడుకు కుటుంబానికి, విదేశాలలో ఉన్న అచ్చం 16 అణాల ఆంధ్రుని లక్షణాలతో ఉన్న చిన్న కొడుకు కుటుంబానికి గల 'అంతరం' చూసి తన అంతరంగంలో ఎంతో నొచ్చుకుంది విశాలక్షమ్మ.. ★

(తెలుగు సారస్వత సమూహం, 23 ఆగస్టు, 1997 సభలో చదివినది.)

## నీవే నా దిక్కంటి

నీవే నా దిక్కంటి నిను నమ్ముకొంటి  
నిను వీడి మనజాలరా.... ఓ బాబా  
నను విడనాడకురా..... ఓ బాబా....  
నను విడనాడకురా...

కాయమె స్థిరమనీ, ప్రాయమె స్థిరమనీ  
హేయముగ బ్రతికితిరా... ఓ బాబా  
ధ్యేయమె మరచితిరా... ఓ బాబా నా  
ధ్యేయమె మరచితిరా....

నీవే నా ధ్యేయము... నీవే నా జీవము  
నీవే నా దైవమురా... ఓ బాబా...  
నీవే నా సర్వమురా... ఓ బాబా...  
నీవే నా సర్వమురా...

నీమాటే నా బాట, నీ పాటే నానోట  
నీ చాటే నా కోటరా... ఓ బాబా...  
నినుజేర నా వేటరా... ఓ బాబా...  
నినుజేర నా వేటరా....

కానా నీవాడను, లేనా నీ నీడను  
ఏమని వేడనురా.... ఓ బాబా...  
దానును వీడనురా.... నీ  
దానును వీడనురా....

ఏలా స్మరించాలో, ఏలా ప్రేమించాలో  
ఏలా సేవించాలో.... ఓ బాబా...  
ఆలా దీవించాలిరా... ఓ బాబా...  
ఆలా దీవించాలిరా..

..

- మంత్రవాది శ్రీ రామమూర్తి  
**Edison, NJ.**

(ధర్మం - అధర్మం, 36వ పేజీ తరువాయి) 

ఇంటికి తిరిగి రావడం. జీవితం కాస్త యాంత్రికం అయిపోతూంది. రీటావచ్చి రెండువారాలు గడిచిపోయాయి. దారిలో రాబర్టు కన్పించాడు. నవ్వుతూ 'బాగున్నావా రీటా? ఏమిటి విశేషాలు?' అంటూ పలకరించాడు.

'ఒంటరితనం బోరుగావుంది. మాట్లాడటానికి మనిషి లేకపోవడం ఇంకా కష్టంగా ఉంది. పిచ్చిపట్టేటట్లు ఉంది. అంతకంటే విశేషాలు లేవు.' అప్పటివరకూ ముభావంగా ఉన్న రీటా చైతన్యస్రవంతే అయింది.

జవాబుగా 'గాసిప్పు అంటే ఏమిటి? ఇద్దరు మనుష్యులు కల్సినప్పుడు అక్కడలేని మూడోవ్యక్తి గురించి మాట్లాడుకోవడమే. విశేషాలు ఎందుకు ఉండవు? మనుష్యులు చేసే వింతపనులు, జీవిత విధానాలు తెలుసుకోవడమే విశేషాలు. నేషనల్ టి.వి. మీద రోజూ చూపిస్తూనే ఉంటారు లైవ్ షోస్. భలే!' అని రీటా అన్నట్టే అనుకరిస్తూ 'తల్లి తన బోయ్‌ఫ్రెండ్‌తో ఏకంగా లేచిపోయిన సంగతి తెలుకోవాలంటే 'జెన్నీ జోన్స్' షో చూడాలి. ఒక తండ్రి తన కూతురుతో పడుకుని పైగా రోజస్ పంపిన వైనం తెలుసుకోవాలంటే 'సేలి జెస్సీ రాఫల్' షో చూడాలి. ఒక అబ్బాయి తన గర్ల్‌ఫ్రెండ్ మదర్‌తో పడుకున్నాడన్న సంగతి తెలుసుకోవాలంటే 'జెర్రీ స్ప్రింగర్' షో చూడాలి. రేప్ చేసిన మనిషినే పెళ్ళిచేసుకొన్న అమ్మాయిని చూడాలంటే 'హెరాల్డో రెవేరా' షో చూడాలి. ప్రతిరోజు మిలియన్స్ మీద చూసే షోస్ ఇవి. మన జీవితాల్లో ఊహించనివి, విననివి సాధారణ సంగతుల్లా జరిగపోతుంటాయి. ఇవి మనం ఎలా వాచ్ చెయ్యాలంటే' ఆగాడు రీటా రియాక్షను చూడటానికి.

'పతితులార, దళితులార' అన్న దృష్టితో మాత్రం కాదు. 'మరి' అంటూ అతన్నే చూస్తూ అంది.

'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుష్యులోయ్' అన్న దృష్టితో చూడాలి. అమెరికా ప్రేమమయం. మనుష్యులు ఎలా ఉంటారో, వాళ్ళ కట్టుబాట్లు, వేషభాషలు- ఎలా నివసిస్తారో ఎంత తొందరగా తెలుసుకుంటే ఇంగ్లీషు అంత తొందరగా వస్తుంది. నీకు కాలక్షేపానికి కొదవవుండదు' అంటూ అన్ని షోస్ పేర్లు వ్రాసియిచ్చాడు.

'వీరంతా ఒక తరగతి మనుష్యులైతే, రెండవరకం మనుష్యుల్ని కూడా తెలుసుకుంటే అమెరికా గురించి తెలుసుకున్నట్లు ఉంటుంది' అంటూ కంటిన్యూ చేశాడు.

అతన్నే చూస్తోంది రీటా.

' సోప్ ఆపెరాస్‌లో ఆరడుగుల అందగాళ్ళు, ఆజానుబాహులు, గంభీర కంఠులు-త్రీపీస్ సూట్లు, టకటకలాడే బూట్లతో చక్కగా ఉండే హీరోలు - సన్నని కంఠాలు, సన్నని నడుమ్స్, హైచీక్ బోన్స్, బ్లాండీలు, బ్రూనెట్ బ్యూటీలు, నీలికళ్ళ నీలిమలు, బ్రవున్ కళ్ళ భామలు, సొట్టబుగ్గలు సుందరాంగులు- వీరు హీరోయిన్లు. చూపుల్లో సూదులు, మాటల్లో తేనెలతో కథ మందంగా మధురంగా నడుస్తూ చూసేవాళ్ళను టి.వి. కి అతుక్కుపోయేలా చేసే షోస్ ఇవి. సోమవారంనుండి శుక్రవారం వరకూ వస్తాయి. మిలియన్స్ వాచ్ చేస్తారు' అంటూ కొన్ని పేర్లు వ్రాసి ఇచ్చాడు.

రాబర్టు మాటలు వినడానికి అదోలా ఉన్నా, ఏ భావం లేకుండా సాధారణసంగతిలాగానే చెప్పాడు. మాటలకు ఫీలింగ్స్‌వుండవని, మంచి, చెడ్డ మనం అనుకోవడంలోనే ఉందని ఇంతకు మునుపు రాబర్టు మాటల్లో అంటూ - 'లావుగా భయంకరంగా కన్పిస్తున్న మనిషి మన దగ్గరకు వచ్చి ఎదురుగా నిల్చున్నప్పుడు తెలియకుండానే మనలో భయం కల్గుతుంది ఏమి జరగబోతుందో అని. అప్పుడామనిషి 'మీ పర్సు పడిపోయింది, మీరు చూసుకున్నట్లు లేద'ని వెళ్ళిపోతాడు. చీకట్లో తాడుని చూసి పాము అనుకున్నట్లేవుంటాయి మన రియాక్షన్స్' అన్నమాటల్ని గుర్తుతెచ్చుకొని చిన్నగా నవ్వుకుంది రీటా.

శలవు తీసుకుని వెళ్ళిపోయాడు రాబర్టు. ఇంత సులువుగా ఇంగ్లీషు నేర్చుకొనే పద్ధతివుంటే శామ్యూల్ ఇంతవరకూ ఎందుకు చెప్పలేదో మరి! అదేమిటో స్వంతంగా తెల్సుకోవాలన్న కోర్కె జనించింది రీటా మనసులో.

..........................................(ఇంకా వుంది)